ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, ఫిబ్రవరి 13 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, సోషల్ స్టేటస్‌తో తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో లక్షల్లో ఫీజులు చెల్లించి చదివిస్తున్నారని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని కదిరేపాడు, శాగాపూర్, మాధవరావుపల్లి, గోప్లాపూర్, బండపల్లి, జమ్మాపూర్, కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కదిరేపాడు, శాగాపూర్, కేతేపల్లి, గోప్లాపూర్ గ్రామాల్లో మంజూరైన సీసీరోడ్ల పనులను మంత్రి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఆహారపు అలవాట్లు, యోగా, నడక తదితర అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యవసాయ పంటలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- వనపర్తి ఎస్పీ గిరిధర్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసాలు, సోషల్ మీడియా ప్రచారాలు, వాట్సాప్ మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారంతో చోరీలు చేయడం, మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, వనితాజ్యోతి మహిళా సంఘం అధ్యక్షురాలు ఏకే ఖమర్ రహెమాన్, స్వర్ణకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

పదోన్నతితో రెట్టింపు బాధ్యత

- ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 13 : పోలీస్ సిబ్బందికి పదోన్నతి ఉత్సాహంతోపాటు విధుల్లో మరింత బాధ్యతను పెంచుతుందని ఎస్పీ తోట శ్రీనివాసరావు అన్నారు. 1999 బ్యాచ్‌కు చెందిన రేఖారెడ్డి, మస్తాన్, యాకుబ్ హుస్సేన్, ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. గురువారం వారు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. విధి నిర్వహణలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజల రక్షణకు పాటుపడాలని సూచించారు. బాధ్యతతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

ఎస్పీని కలిసిన హెడ్ కానిస్టేబుల్

ముగిసిన పదోపటలం వార్షిక స్పోర్ట్స్‌మీట్

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 13 : ఎర్రవల్లి మండలంలోని పదో పటాలంలో కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో బెటాలియన్ వార్షిక స్పోర్ట్స్‌మీట్‌ను రెండు రోజులపాటు నిర్వహించారు. గురువారం ముగింపు వేడుకల్లో 110 మందికి 100 మీటర్ల పరుగుపందెం, వాలీబాల్, క్రికెట్, టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో ఫైనల్స్ నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు కమాండెంట్ సాంబయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ జయరాజు, శ్రీనివాస్, ఆర్‌ఐలు ఆర్పీ సింగ్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సుధీర్, సుధాకర్, అశోక్, బొజ్జానాయక్, జేఏ సత్యనారాయణ, చిన్నలింగన్న, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఆత్మకూరు ఎంపీడీవోగా శ్రీపాద్

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 : ఆత్మకూరు నూతన ఎంపీడీవోగా శ్రీపాద్ నియామకమయ్యారు. మహబూబ్‌నగర్ డీఆర్‌డీఏలో ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీపాద్ గురువారం ఆత్మకూరు ఎంపీడీవోగా బా ధ్యతలు స్వీకరించారు. ఎంపీవో శ్రీరాంరెడ్డి, సూపరింటెండెంట్ ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కొత్తకోట, ఫిబ్రవరి 13 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని పాలెం శివారులో హైదరాబాద్ వైపు వెళ్తున్న టిప్పర్‌ను తనిఖీ చేయగా, ఇసుక ఉందని, అనుమతి లేకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా జనుంపల్లికి చెందిన మహేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

పెబ్బేర్ రాంపురం గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే.. కఠిన చర్యలు

- వనపర్తి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెబ్బేర్, ఫిబ్రవరి 13 : పేదలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అవసరమైన వారి ఇంటి వద్దకే ఇసుకను సరాఫరా చేసే అవకాశం కల్పించిందని, ఎవరైనా ఇసుకను అక్రమంగా నిల్వ చేసి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని రాంపురం గ్రామ పరిధిలో అక్రమంగా డంపు చేసిన నాలుగు వందల ట్రాక్టర్ల ఇసుకను ఆర్డీవో సుబ్రమణ్యం, తాసీల్దార్‌తో కలిసి గుర్తించారు. డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అయిజ, ఫిబ్రవరి 13 : పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును ఆలయ కమిటీ ఆహ్వానించింది. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఈ నెల 15 నుంచి 28 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల పత్రికను అందజేశారు.

కబడ్డీ పోటీలకు బాలబాలికల జట్లు ఎంపిక

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 : ఈనెల 16వ తేదీన ఉదయం 8:30గంటలకు వనపర్తి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపికలు న్విహించనున్నట్లు కబడ్డీ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కురుమయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 1 ఏప్రిల్ 2009 తర్వాత జన్మించిన వారై ఉండి, 16ఏండ్లలోపు, 55 కేజీలలోపు బరువు కలిగి ఉండాలన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. జిల్లా నుంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23వరకు వికారాబాద్‌లో జరుగనున్న 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 8500165900 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్లేట్లు, దుస్తులు పంపిణీ

అయిజ రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని కేశవరం పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త సుధాకర్‌రావు, అరుణాబాయి దంపతులు తమ కుమారుడు జగదీశ్వర్‌రావు జ్ఞాపకార్థం గురువారం 160 ప్లేట్లు, దుస్తులను గురువారం పంపిణీ చేశారు.

జాతీయ మహిళా దినోత్సవం

మహిళలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 : చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటమ్మ, పాఠశాల ఉపాధ్యాయురాలు రుద్రమాదేవిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, భారత కోకిల సరోజినీ నాయుడు జన్మదినం సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర గుప్తా, సంజీవయ్య, వరదాచారి, మహ్మద్ షఫీ, పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇండ్లల్లో చోరీ

అలంపూర్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని మూడు ఇండ్లల్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై వెంకటస్వామి తెలిపారు. న్యూ ప్లాట్స్ కాలనీలో మెయిన్ రోడ్ పక్కన గల ఇండ్లల్లో బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు చోరీకి గునైనట్టు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ వినోద్, బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి నర్సింహ, మరొకరి ఇంట్లో చోరీ జరిగాయి. వినోద్ ఇంట్లో సీసీ కెమెరాలు ఉండగా, దొంగలు హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అలంపూర్, ఫిబ్రవరి 13 : అలంపూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ర్యాలంపాడు–అలంపూర్ గ్రామాల మధ్య తుంగభద్ర నదిపై ఉన్న వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు అలంపూర్ పోలీసులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి నదిలో కొట్టుకుని వచ్చినట్టు పేర్కొన్నారు. మృతుడి వయసు 50 ఏండ్లు ఉంటుందని, మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ దవాఖానలో భద్రపర్చినట్లు వెల్లడించారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ క్రియేట్ చేయాలి

మాట్లాడుతున్న డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘని

అయిజ, ఫిబ్రవరి 13 : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ క్రియేట్ చేయాలని డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘని హెచ్‌ఎంలను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. అపార్ ఐడీ క్రియేట్ చేయడంలో ప్రైవేట్ పాఠశాలలు వెనుకబడ్డాయని, టెక్నికల్ సమస్యలుంటే ఎమ్మార్సీలో సంప్రదించి పరిష్కరించుకొని అపార్ చేయాలని సూచించారు. అపార్ ఐడీ క్రియేట్‌ను వంద శాతం తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈవో రాములు, సెక్టోరియల్ అధికారి శాంతరాజు పాల్గొన్నారు.

అపార్‌పై అవగాహన

ధరూరు, ఫిబ్రవరి 12 : విద్యార్థులకు అపార్‌పై అవగాహన కల్పించాలని ఎంఈవో రవీంద్రబాబు సూచించారు. మండలంలోని చిన్నచింతరేవుల పాఠశాలలో, రేవులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ డే, సరోజినీ నాయుడు జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆధార్ నమోదును వేగవంతం చేయాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 13: విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలని డీఈవో అబ్దుల్ ఘని హెచ్‌ఎంలకు సూచించారు. శాంతినగర్‌లో గురువారం ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల డేటా డిజిటలైజేషన్ కోసం ఆధార్ నమోదు చాలా ముఖ్యమైన విషయమని, ఆధార్ ఆవశ్యకతను విద్యార్థుల తల్లితండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహ, జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌లో 5.5అడుగుల నీటి నిల్వ

ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

అయిజ, ఫిబ్రవరి 13 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ తగ్గుతోంది. గురువారం ప్రధాన కాల్వకు 332 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ఆనకట్టలో 5.5 అడుగుల నీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి బుధవారం నుంచి ఆర్డీఎస్‌కు నీటిని విడుదల చేశారు. ఆదివారం ఉదయం వరకు టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. ఆర్డీఎస్ నుంచి వస్తున్న నీరు డీ–16 వరకు స్వల్పంగా చేరుతుందని వెల్లడించారు.

టీబీ డ్యాంలో 44 టీఎంసీల నిల్వ..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 44.482 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, అవుట్‌ఫ్లో 7,732 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 44.482 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1613.29 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని బండమీది తండాకు చెందిన కాట్రావత్ అంజుగోపాల్ పేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం తండా నుంచి గోపాల్‌పేటకు వస్తుండగా, కస్తూర్బాగాంధీ పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై చీర్కపల్లి గ్రామానికి చెందిన గడ్డిగోపుల మహేశ్ కారును అజాగ్రత్తగా నడిపి వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. అంజు భార్య కాట్రావత్ సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష..

డ్రంకెన్ డ్రైవ్‌లో గురువారం గోపాల్‌పేట మండలానికి చెందిన వ్యక్తికి 6రోజులు, వనపర్తికి చెందిన వ్యక్తికి 3రోజుల జైలు శిక్ష పడ్డట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కొత్తకోట, ఫిబ్రవరి 13 : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన చంద్రమౌళి(73) పెబ్బేరుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోడంతో కుటుంబ సభ్యులు గురువారం ఫి ర్యాదు చేసినట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన సంజత్ జయంత్ ఫ్లబికేషన్ టెస్టు పేపర్లను విక్రయించేందుకు ఉదయం వనపర్తికి వచ్చాడు. అన్ని కళాశాలలకు తిరిగి బస్టాండ్ పక్కనే ఉన్న మసీదులో ప్రార్థన చేసుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కారులోనుంచి పొగలు, మంటలు రావడంతో వెంటనే అప్రమత్తమై కారును పక్కకు నిలిపి ఇంజిన్ ముందు భాగాన్ని ఓపెన్ చేశాడు. ఫైర్ అధికారులకు సమాచారం అందజేయగా, ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొత్తకోట, ఫిబ్రవరి 13 : మండలంలోని కానాయపల్లికి చెందిన హేమవర్ధన్(22) తన బాబాయి కూతురు సహర్ష(8)తో కలిసి బైక్‌పై బంధువుల వివాహానికి ముమ్మళ్లపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై అమడబాకుల స్టేజీ వద్ద కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో హేమవర్ధన్, సహర్షకు గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల రూరల్, ఫిబ్రవరి 13 : విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పుటాన్‌పల్లి వద్ద గల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల(బాలికల)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పరిస్థితులను సమీక్షించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, హాజరుశాతం మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు.

పుటాన్‌పల్లి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

దళారులను ఆశ్రయించొద్దు

- ఇసుక కోసం కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 : జిల్లాలో ఇసుక అవసరమున్న వారు దళారులను ఆశ్రయించొద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఇసుక అవసరమున్న వారు ఇంటి వద్దకే ఇసుకను సరాఫరా చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే ప్రజలు కంట్రోల్ రూంకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూం పోన్ నెంబర్ 08545 233525ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇటిక్యాల, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో మహ్మద్ అజర్ మొయిద్దీన్ తెలిపారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఎర్రవల్లి మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలకు 41 పోలింగ్ కేంద్రాలు, ఇటిక్యాల మండలంలో 7 స్థానాలకు 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొండేర్‌లో ఒక పోలింగ్ కేంద్రం, అలాగే చాగాపురంలో ఒక పోలింగ్ కేంద్రం పెరిగాయన్నారు. 700 ఓట్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎర్రవల్లి ఎంపీడీవో సయ్యద్‌ఖాన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

అవినీతి అధికారిపై రహస్య విచారణ

గద్వాల, ఫిబ్రవరి 13 : కొంతకాలంగా అవినీతి వ్యవహారంలో ఓ పోలీస్ అధికారి అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సదరు పోలీస్ అధికారికి అవినీతి అంశాలకు సంబంధించి 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో వరుస కథనాలు ప్రచురించడంతో పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. సదరు మండల పోలీస్ అధికారిపై ఓ ప్రత్యేక పోలీస్ బృందంతో రెండు రోజులుగా రహస్యంగా విచారణ చేపట్టి అవినీతికి సంబంధించిన పలు వివరాలు సేకరించినట్లు సమాచారం. పోలీస్ అధికారి విధుల్లో చేరినప్పటి నుంచి నేటి వరకు చేసిన అవినీతి చిట్టాను ఓ నివేదిక రూపంలో తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇసుక, మట్టి, బియ్యం మాఫియా నుంచి వసూల మొదలుకొని స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సెటిల్‌మెంట్లు తదితర వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇసుక, మట్టి, బియ్యం మాఫియా నుంచి వసూలు చేసేందుకు స్టేషన్‌కు సంబంధించి పోలీస్ సిబ్బందిని నియమించుకొని అన్ని వ్యవహారాలు ఆయనతోనే నడిపించిన్నట్లు, అలాగే సదరు పోలీస్ అధికారి తీరుపై పోలీస్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. సదరు పోలీస్ అధికారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు పోలీస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

అవినీతికి పాల్పడిన పోలీస్ సిబ్బందిపై వేటు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 13 : అవినీతికి పాల్పడిన పోలీస్ సిబ్బంది రమేశ్‌నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. కొన్నాళ్ల కిందట ఇటిక్యాల మండల పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి పేకాటకు సంబంధించి డబ్బులను జమ చేసే క్రమంలో పోలీస్ సిబ్బంది రూ.80వేలు చేతివాటం ప్రదర్శించినట్లు పత్రికల్లో రావడంతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. డబ్బులు తీసినట్లు తేలడంతో సదరు పోలీస్ సిబ్బందిపై వేటు వేసినట్లు తెలిసింది.

ఆలయ ఈవోపై అవినీతి ఆరోపణలు

- దేవాదాయ శాఖ కార్యదర్శికి ఫిర్యాదు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 13 : ఆలయ ఈవో అవినీతిపై అన్ని ఆధారాలతో గురువారం హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎస్ఎస్ సోమరాజుకు ఫిర్యాదు చేసినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. జోగుళాంబ ఆలయంతోపాటు గద్వాల సమీపంలోని జములమ్మ, పాగుంట వేంకటేశ్వర స్వామి ఆలయాలకు పురేందర్ ఈవోగా విధులు నిర్వహిస్తున్నారని, పలుకుబడిని ఉపయోగించి ఆలయాల్లో ఆడిట్ జరిపించకుండా, దేవస్థానాల డబ్బును కాజేసినట్లు ఆరోపించారు.

ఎన్ఆర్‌జీఎస్‌పై సోషల్ ఆడిట్

ఇటిక్యాల, ఫిబ్రవరి 13 : మండలంలో ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్ జరుగుతోందని ఎంపీడీవో అజర్ మహ్మద్ మొయిద్దీన్ తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి నెలాఖరు వరకు జరిగిన రూ.3కోట్ల 97లక్షల 58వేలకు సంబంధించిన పనులపై 14మంది డీఆర్పీల ఆధ్వర్యంలో ఆడిట్ చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామసభల అనంతరం 18న మండల కేంద్రంలో పబ్లిక్ హియరింగ్ ఉంటుందని ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదం కాదు హత్య

వడ్డేపల్లి, ఫిబ్రవరి 13 : శాంతినగర్‌లో బుధవారం రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదంలో రమేశ్ మృతిచెందగా, అతడి మామ సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, రమేశ్ మృతిపై బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ టాటాబాబు విచారణ చేపట్టగా, రోడ్డు ప్రమాదం కాదని హత్యగా సీఐ స్పష్టం చేశారు. కాగా, పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. మృతిచెందిన రమేశ్ అంత్యక్రియలు తనగలలో గురువారం పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

గద్వాల రూరల్, ఫిబ్రవరి 13 : జిల్లా కేంద్రంలోని క్రైస్తవ సహాయ సహకార సంఘ సభ్యులు తాండ్రపాడుకు చెందిన అరుణ(45) క్యాన్సర్ కారణంగా అనారోగ్యంతో బాధపడటంతో గురువారం బాధిత మహిళకు రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో శంకర్, తిమ్మన్న, నల్లారెడ్డి, ఆనంద్, కృష్ణ, భాస్కర్, దినేశ్, రాజు, పరుశరాము ఉన్నారు.